# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 6 మే – 2025 పేజీలు: 24



# ప్రభుత్వ విద్యా విక్రమార్కులు









# గురుకులంలో గురువు

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని, పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి ముప్పాళ్ల వెళ్లిన సీఎం చంద్రబాబు గురుకుల పాఠశాలకు వెళ్లారు.

*ఈ సందర్భంగా టీచర్, వార్డెన్, కేర్ టేకర్, పేరెంట్, లీడర్, ఆఫీసర్ అన్నీ తానై విద్యార్థినుల యోగక్షేమాలు తెలుసుకున్నారు సీఎం. బాలికలతో కలిసి తరగతి గదులు, వంటగది, హాస్టల్ రూములు, వాష్ రూములన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు.*







# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 1 సంచిక: 6 మే – 2025 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయ్ రామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD -1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె. పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**డీటీపీ & సహకారం**
**కె.అభిషేక్**
**చిత్రకారులు**
**మల్లిక్**

## సంస్కరణల ఫలాలు.. ఉత్తమ ఫలితాలు

ప్రభుత్వ విద్య వికసించింది. ప్రభుత్వ విద్యార్థులు ప్రకాశించారు. కఠినపరీక్షలు నెగ్గి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచారు. కార్పొరేటు స్కూళ్లకు దీటుగా, ప్రైవేటు కాలేజీలతో పోటీపడుతూ మార్కులతో గవర్నమెంట్ ఎడ్యుకేషన్ మార్క్ చూపించారు.

ఈ ఏడాది పరీక్షల ఫలితాలలో ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించారు. సంస్కరణలు ఫలితాల్లో కనిపించాయి. ప్రభుత్వం కోరుకున్న మార్పు మార్కుల్లో స్పష్టమైంది.

గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో గత పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. పదో తరగతి ఫలితాల్లోనూ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం 81.14గా నమోదు అయ్యింది. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, పరిష్కరించిన సమస్యలకు పదేళ్ల రికార్డులను తిరగరాసిన ఫలితాలే నిదర్శనం. మా షైనింగ్ స్టార్స్ మా ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లు. ఈ అద్భుత ఫలితాల్లో భాగమైన అందరికీ అభినందనలు..

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

# పిల్లలూ..
# సెలవుల్లో జాగ్రత్త

పిల్లలు ఇంటర్, పది పరీక్షలు పూర్తి చేసుకున్నారు. మిగిలిన క్లాసులకు వేసవి సెలవులు ఇచ్చేశారు. సెలవులంటే ఆనందం ఉండని పిల్లలు ఎవరు? సెలవుల్లో ఆడుతూ, పాడుతూ కాలం గడుపుతారు విద్యార్థులు. అయితే సెలవుల సమయంలో తగు జాగ్రత్తలు లేని కారణంగా పిల్లలు ప్రమాదాలకు గురికావడం, కొన్ని సందర్భాలలో చనిపోవడం కూడా చూస్తున్నాము. టీచర్లు, తల్లిదండ్రులు ఈ క్రింది విషయాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల్లో అవగాహన పెంపొందించాలి.





## చెయ్యకూడనివి:

సెలవుల్లో పిల్లలు ఊర్లో చెరువులు, కుంటలు, నదులు, సముద్రాలలో ఈతకు వెళతారు. చాలా ఆనందిస్తారు. కానీ చాలా చోట్ల ప్రమాదాలు జరిగి విషాదం మిగులుతోంది.

1. ఈత రాకుండా, తగు జాగ్రత్తలు లేకుండా జలాశయాలు, చెరువులు, వాగులు, కుంటలు మొదలైన వాటి దగ్గరకు వెళ్ళడం, ఆడటం, ఈత కోసం దిగడం వంటివి చేయకూడదు.
2. ఇంటి వద్ద గాని, వ్యవసాయ బావి వద్ద గాని విద్యుత్తు పరికరాలను సరిచెయ్యడానికి ప్రయతించకూడదు. ముట్టుకోకూడదు. వాటిని వృత్తి నిపుణులతోనే చేయించాలి.
3. టూ వీలర్, ఫోర్ వీలర్, ట్రాక్టర్ వంటి వాహనాల విషయాలలో కూడా పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వివిధ రకాల వాహన ప్రమాదాల గురించి పిల్లలతో చర్చించండి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పండి
4. మొబైల్ ఫోన్ వాడటం, కొనడం, అమ్మడం వంటి విషయాలలో తల్లిదండ్రులకు తెలియకుండా పిల్లలు కొన్ని తగాదాలలో తలదూర్చి ప్రమాదాలలో పడుతున్నారు. ఇలాంటి వాటి పట్ల అవగాహన కల్పించండి.
5. రక్షణ గోడలు లేని డాబాలపై (స్లాబ్) పడుకోకుండా చూడాలి. స్లాబ్ ఆనుకుని ఉన్న విద్యుత్తు తీగల గురించి హెచ్చరించాలి.
6. స్నేహితుని పుట్టినరోజు అని చెప్పి బయటకి వెళ్ళి ప్రమాదాల బారిన పడుతున్నారు. జాగ్రత్త వహించండి.





7. ప్రమాదకర ఆటలు, సాహసకృత్యాలు వద్దని వారించండి.

8. సోషల్ మీడియా ట్రెండుని ఫాలో అవుతూ, ప్రమాదకర ప్రాంతాల్లో రీల్స్ చేయడం, స్టంట్స్ యత్నించడం వల్ల పర్యవసానాలను తల్లిదండ్రులు పిల్లలను అర్థమయ్యేలా వివరించాలి.



## చెయ్యాల్సినవి:

1. పిల్లల లక్ష్యానికి సంబంధించిన వ్యక్తులను పరిచయం చేయండి. ఉదాహరణకు మెడిసిన్ లక్ష్యం పెట్టుకున్న వాళ్ళకు మెడిసిన్ చదివే వాళ్ళతో మాట్లాడించడం.

2. ఎంసెట్, నీట్ వంటి వివిధ పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, అర్హత పరీక్షల గురించి అవగాహన కల్పించండి.

3. బ్యాంక్ అకౌంట్, పాస్ పోర్ట్ వంటి పనులు కూడా సెలవులలో పూర్తి చేసుకునేలా చూడండి. పిల్లల సర్టిఫికెట్స్, ఆధార్, పాన్ నంబర్ వంటి ముఖ్యమైన డాక్యుమెంట్స్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్ ఒక ఫైల్ పెట్టించాలి.



4. కుటుంబ సభ్యులతో, బంధువులతో, ముఖ్యంగా తాతయ్యలతో, నానమ్మలతో, అమ్మమ్మలతో సమయాన్ని గడిపేలా చూడండి. జ్ఞాపకం కోసం వారితో ఫోటోలు, వీడియోలు తీసుకునేలా చూడండి.

5. పిల్లలకు కుటుంబ చరిత్ర చెప్పండి. గుర్తున్న మేర పూర్వీకుల జనన మరణాలు, వారి చదువు, వృత్తి, ఉపాధి వంటి ప్రాథమిక సమాచారంతో పిల్లల చేత వంశ వృక్షాన్ని రాయించండి.

6. పిల్లలకు-పేరెంట్స్ కు మధ్య ప్రశ్నలు జవాబులే ఉంటున్నాయి. మామూలు విషయాలపైన ఎక్కువసేపు మాట్లాడే ప్రయత్నం చేయండి. అది మీ మధ్య భావోద్వేగ సంబంధం పెంచుతుంది.

*ఇంకా పిల్లలకు సెలవులలో ఇచ్చిన ప్రాజెక్ట్ పనుల గురించి, టీచర్ల గురించి, హాస్టల్ గురించి, చర్చించండి. తల్లిదండ్రులు తమ పని ప్రదేశాలకు పిల్లలను తీసుకెళ్లి తాము ప్రతి నిత్యం ఏం చేస్తున్నామో చూపించవచ్చు.*

*సెలవులు ఆట విడుపును, అవగాహనను కలిగించాలి గాని విషాదాన్ని కాదు.*



**-డా. పుల్లూరి సంపత్ రావు**
9849396168
"ఎడ్యుకేషనల్ డైరీ" నుంచి



# నేనున్నానని.. నీకేం కాదనీ..



## ఆటిజం చిన్నారులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

దేశంలో మొదటిసారి ఆటిజం పిల్లల భవిష్యత్తు గురించి ఒక ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్న విషయం తెలుసుకుని చాలా సంతోషం కలిగింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సమగ్రశిక్షాలో భాగంగా..ఆటిజం కేంద్రాలు నిర్వహించాలన్న నిర్ణయం..ఎందరో తల్లిదండ్రులకు ఆశాదీపం అవుతుంది.

### ఆటిజం అంటే..?

ఆటిజం వ్యాధి కాదు. మందులేని న్యూరో డిజార్డర్! ఒక్కో చిన్నారిలో, ఒక్కో తరహా సమస్య ఉంటుంది. వీటన్నిటినీ కలిపి స్పెక్ట్రమ్‌గా వ్యవహరిస్తారు. ఎక్కడో అమెరికా, యూరప్ దేశాల్లో పిల్లల సమస్య కాదు ఇది! మన చుట్టూ మనకు తెలియకుండా ఓ ఆటిజం సమాజమే ఏర్పడుతోంది. Autism spectrum disorder వంటి న్యూరలాజికల్ డిజార్డర్ ఉన్న పిల్లలు..దేశంలో కోటిమందికి పైనే ఉన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రెండు లక్షలమందికిపైనే ఉంటారు.

### కారణాలు కాదు..ఏం చేయాలో ఆలోచించాలి

నిజానికి ఆటిజం వ్యాధి కాదు. It's a neurodevelopmental disorder. అది ఎందుకు వస్తుందో ఇప్పటికీ కచ్చితంగా తేలలేదు. మన దేశంలో గత 20 ఏళ్ల నుంచి ఆటిజం కేసులు పెరుగుతున్నాయి. లైఫ్‌స్టైల్ మార్పులు, రేడియేషన్, పొల్యూషన్, పంటల్లో క్రిమి సంహారకాలు, న్యూక్లియర్ ఫామిలీస్, అపార్ట్మెంట్ కల్చర్, ప్రెగ్నెన్సీ లో సమస్యలు, గర్భిణిగా ఉన్నప్పుడు మానసిక ఒత్తిళ్లు, డెలివరీలో సమస్యలు, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్సుకు పిల్లలు ఎడిక్ట్ కావడం..ఇలా ఒకటేమిటి ఎన్నో కారణాలు పిల్లల మానసిక ఎదుగుదల పాలిట శాపంగా మారుతున్నాయి.



### జీవితాన్ని అలవాటు చేయాలి

మనకు జీవితంలో అనేక అలవాట్లు ఉంటాయి. కానీ ఆటిజం పిల్లలకు జీవితాన్నే అలవాటు చేయాలి. 'భాష రావాలంటే బతకాలి' అన్న మాట ఎంత నిజమో..ఆటిజం పిల్లలకు ప్రపంచాన్ని అలవాటు చేయడం అంత నిజం! మన చేతుల్లో ఉన్నది అదొక్కటే!

ఆటిజం పిల్లల బ్రెయిన్ నిరంతరం ట్రైన్ చేయాలి. మైల్డ్, మాడరేట్, సివియర్..ఇలా ఆటిజం తీవ్రతను బట్టి..చిన్నారులకు ఆక్యుపేషన్, బిహేవియర్, స్పీచ్ వంటి రకరకాల థెరపీలను నిపుణులు సూచిస్తారు. ఆ థెరపీలను అందించే క్రమంలో తల్లిదండ్రుల్లో ఒకరు పిల్లలకు ఇవి నేర్పించేందుకు పూర్తిగా అంకితం కావాల్సివుంటుంది. కొన్నేళ్లపాటు కుటుంబపరంగా, సామాజికంగా, ఆర్థికంగా అవరోధాలు ఎదురవుతూనే ఉంటాయి. కానీ పిల్లల భవిష్యత్ కోసం ధైర్యంగా నిలబడాలి.

ఆటిజం పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే కాదు..సమాజానిది కూడా! ప్రభుత్వాలు కలగజేసుకోకపోతే, భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో.. ఈ ప్రత్యేక అవసరాలున్న పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరమే అవుతుంది. థెరపీలతో మొదలుపెట్టి..విద్య, వైద్యం, సామాజిక భద్రత ఇలా అన్ని విషయాల్లో ప్రభుత్వం ఈ పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సివుంది.

### అమ్మా నాన్నలారా దయచేసి ఆటిజం గురించి తెలుసుకోండి..

* మీ ఇంట్లో చంటి పిల్లలు ఉన్నారా?
* వాళ్ళు పుట్టగానే ఏడ్చారా? లేదా?
* తల్లి పాలు తాగారా? లేక ఫార్ములా మిల్క్ కి అలవాటు పడ్డారా?
* మీ పిల్లలు మీకు Eye Contact ఇస్తున్నారా?
* మెడ నిలపగలుగుతున్నారా?
* సమయానికి బోర్లా పడ్డారా? లేదా?



* రెండు చేతులతో పాకుతున్నారా? లేక ఇబ్బంది పడుతున్నారా?
* సరిగ్గా నడుస్తున్నారా? నడిస్తే.. కాళ్ళు ఎలా ఉన్నాయి?
* నేల మీద సరిగ్గా కూర్చోగలుగుతున్నారా?
* లేక కాళ్ళు చాపలేక..W షేప్లో కూర్చొంటున్నారా?
* ముఖ్యంగా పేరు పెట్టి పిలిచినప్పుడు పిల్లలు పలుకుతున్నారా? లేదా?
* తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నారా? లేక.. ఎవ్వరినీ పట్టించుకోకుండా..చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారా?
* తమ ప్రపంచంలో ఉంటూ.. ఆడిన ఆటే ఒంటరిగా ఆడుతున్నారా?
* రెండేళ్లకు కూడా చిన్న చిన్న మాటలు కూడా రావడం లేదా? ఎప్పుడూ హైపర్ గా ఉంటున్నారా?
* వద్దు అంటే..తమను తాము Hurt చేసుకుంటున్నారా? లేదా ఎదుటివారిని hurt చేస్తున్నారా?
* నలుగురి మధ్యకు వెళ్ళినప్పుడు ఇమడలేకపోతున్నారా?
* ముఖం ముట్టుకోనివ్వడం లేదా?
* బ్రష్ చేయనివ్వడం లేదా?
* స్నానం చేయడానికి గోల గోల చేస్తున్నారా?
* అన్నం తినడానికి ముప్పుతిప్పలు పెడుతున్నారా?
* Facial expressions ఉన్నాయా.. లేదా?
* టాటా చెప్పడం..మీరు ఇంటికి రాగానే ముద్దు పెట్టుకోవడం వంటి emotions ఉన్నాయా లేదా?
* చేతులు, కాళ్లు ఉపయోగిస్తూ..Fine Motor Skills డెవలప్ అవుతున్నాయా లేదా?

## పిల్లల సోషల్ బిహేవియర్ ఎలా ఉంది?

ఇవన్నీ చిన్న విషయాలని తేలిగ్గా తీసుకోకండి. తీరిక లేకుండా.. యంత్రాల్లా పనిచేస్తూ..పసి పిల్లలను పట్టించుకోవడం మానేయకండి. మన నిర్లక్ష్యం పిల్లల్లో ఆటిజం/ADHD లక్షణాలు పెరిగేలా చేస్తుంది. పెద్దల తప్పులకు పిల్లలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. ఏ కెరీర్ కోసం రాత్రీపగలు కష్టపడుతున్నారో..దానిని వదిలి Therapy Centres చుట్టూ తిరగాల్సి ఉంటుంది. Occupation Therapy, Sensory Integration, Behaviour Therapy, Speech Therapy..ఇలా మీరు ఎప్పుడూ వినని విషయాల గురించి రీసెర్చ్ చేసి.. రోజూ మూడు నాలుగు గంటల సేపు థెరపీ సెంటర్లకు తీసుకెళ్లాల్సి వుంటుంది.

అంతేకాదు, థెరపీకి కనీసం 12 వేలు చొప్పున..ప్రతి నెలా 30-40 వేలు ఖర్చు పెట్టాల్సి వుంటుంది. ఇంత ఖర్చు పెట్టినా పిల్లలు నార్మల్ అవుతారని డాక్టర్లు గ్యారంటీ ఇవ్వలేరు. మూడు నెలలకు ఒకసారి



Psychology assessment లు, Pediatric Neurologistల రివ్యూల కోసం గంటలకు గంటలు టెన్షన్ తో ఎదురుచూడాల్సి ఉంటుంది.

Play School కి వెళ్లాల్సిన చిన్నారులను థెరపీలకు తీసుకెళ్లడం..ప్రపంచం తెలియని పిల్లలు ఎలా బతుకుతారో అన్న ఆందోళన..

తమ తర్వాత పిల్లల్ని ఎవరు చూసుకుంటారన్నఆవేదన..అర్థం చేసుకోలేని మనుషులు..అర్థమైనా పట్టించుకోని ఆప్తులు..చెప్పుకోలేని అవమానాలు..థెరపీల కోసం ఆర్థిక ఇబ్బందులు..తల్లిదండ్రులను కుంగదీస్తాయి. ముఖ్యంగా తల్లులను కుమిలిపోయేలా చేస్తాయి.


అందుకే పిల్లలకు సమయం ఇవ్వండి. వారి శారీరక, మానసిక ఎదుగుదలను జాగ్రత్తగా గమనించండి. పిల్లలు హైపర్ గా ఉండటం, పెంకిగా ఉండటం సహజమే. కానీ పిలిచినా పలకకపోవడం, ఐ-కాంటాక్ట్ ఇవ్వక పోవడం, చేసిన పనే మళ్లీ మళ్లీ చేయడం, సోషల్ బిహేవియర్ లేకపోవడం తేలిగ్గా తీసుకోవద్దు. అవి ఆటిజం లక్షణాలు.

మైల్డ్, మాడరేట్, సివియర్..ఇలా మూడు స్థాయిల్లో ఆటిజం తీవ్రతను సైకాలజిస్ట్ లు అంచనా వేస్తారు. ఒకవేళ ఆటిజంఅని తేలినా..తల్లిదండ్రులు కుంగిపోకూడదు. ఓపిక అలవాటు చేసుకోవాలి. ఒకరినొకరు నిందించుకుని టైమ్ వేస్ట్ చేసుకోకూడదు. ముఖ్యంగా తల్లికి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అండగా నిలవాలి.

## ఆటిజం పిల్లల కోసం ఆంధ్రప్రదేశ్ చొరవ

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం హర్షణీయం.

అయితే ఏడాదిన్నర రెండేళ్లలోపు





గుర్తించగలిగితే..ఆటిజం లక్షణాల నుంచి చిన్నారులను త్వరగా బయటపడేయడానికి అవకాశం ఉంటుంది.

- ఇందుకోసం ప్రభుత్వం ఉచిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తే బాగుంటుంది.

- అలాగే, పిన్నవయసులోనే గుర్తించడంతోబాటు ట్రైన్డ్ ప్రొఫెషనల్స్ తో Early Intervention Centers ఏర్పాటు చేయడం కూడా చాలా అవసరం.

- చాలా ప్రైవేట్ స్కూళ్లు ఆటిజం పిల్లలను చేర్చుకోవడం లేదు. ఒకవేళ చేర్చుకున్నా లక్షలకు లక్షలు ఫీజులు భరించే పరిస్థితి తల్లిదండ్రులకు లేదు. అందుకే ఆటిజం చిన్నారుల కోసం ప్రభుత్వమే శిక్షణ పొందిన స్పెషల్ ఎడ్యుకేటర్లు, థెరపిస్టులతోInclusive Schools ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగేందుకు ఆర్థిక వనరులతో పాటు, టెక్నాలజీ-లెర్నింగ్ ఎయిడ్స్ సమకూర్చాల్సి వుంటుంది.

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత లేదా తక్కువ ఫీజులకే స్పీచ్ థెరపీ, ఆక్యుపేషన్ థెరపీ, బిహేవియర్ థెరపీలను అందుబాటులోకి తేవాల్సివుంటుంది.

- మన దేశంలో మెంటల్ హెల్త్ గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ మానసిక ఆరోగ్యంపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన సమయమిది! ఆటిజం చిన్నారుల కోసం కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైతే మెడికేషన్ అందించాల్సివుంటుంది.

- ఆటిజం చిన్నారులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఇన్స్యూరెన్స్! ఏ బీమా సంస్థ ఈ పిల్లల కోసం పూర్తిస్థాయి పాలసీ తీసుకురాలేదు. ఆటిజం సంబంధిత థెరపీలు, చికిత్సలకు.. ఇన్స్యూరెన్స్ కవరేజ్ వర్తించేలా..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- ఆటిజం పిల్లలు ఏ క్షణంలో ఎలా ఉంటారో..ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. యుక్తవయసులో వారిని హ్యాండిల్ చేయడం ఇంకా కష్టం! అందుకే, తమ పిల్లలను చక్కదిద్దుకునే విధంగా.. తల్లిదండ్రులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. నిత్యం ఒత్తిడిని ఎదుర్కొనే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, సామాజికంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

- అన్నెంపున్నెం తెలియని ఆటిజం పిల్లలకు చట్టపరమైన హక్కుల కల్పన, పరిరక్షణ, సామాజిక భద్రత అత్యంత అవసరం! ఇందుకోసం ఆటిజాన్ని వైకల్యంగా గుర్తించే Disabilities Act (RPWD), 2016 అమలు చేయాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేవిధంగా..ఆటిజం చిన్నారులకు డిజేబిలిటీ సర్టిఫికెట్లు అందించాలి.

- ఆటిజం పిల్లలకు..విద్య, ఉద్యోగాల్లో డిజేబిలిటీ కోటా కింద రిజర్వేషన్లు కల్పించాలి

- ఆటిజంపై అపోహలు తొలగించి, సమాజం ఈ పిల్లలను అంగీకరించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

- BPL కుటుంబాల్లోని ఆటిజం యువకులకు డిజేబిలిటీ పెన్షన్ స్కీమ్స్ అందించాలి. అలాగే ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టంలోని 80U, 80 DD కింద..ట్యాక్స్ బెనెఫిట్స్ అందించాలి.

- సంక్షేమ గృహాలు, డే-కేర్ సెంటర్లు ఆశ్రయంతోబాటు.. భవిష్యత్తులో తమ కాళ్లమీద తాము నిలబడేలా ఒకేషనల్ ట్రైనింగ్ అందించాలి.

## చివరిగా ఒక్క మాట..

మేం బతికున్నంతకాలం ఎలాగోలా సాకుతాం. కానీ, మా తర్వాత ఈ పిల్లలను ఎవరు పట్టించుకుంటారు? వారికెవరు పట్టెడన్నం పెడతారు? ప్రతిరోజు తల్లిదండ్రులను కలచివేసే ప్రశ్నలివి. ఆటిజం పిల్లలకు సమాజపరంగా లాలన.. ప్రభుత్వపరంగా పాలన లభిస్తే.. తల్లిదండ్రులు కాసింతైనా నిశ్చింతగా ఉండగలుగుతారు. ఈ క్రమంలో ప్రభుత్వం దృష్టిసారించాలని మనవి!

- **భాను కిరణ్**, (ఒక ఆటిజం చిన్నారి తండ్రి)
9848978999
mail-kirannbhanu@gmail.com



## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 125 ఆటిజం కేంద్రాల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చొరవతో కేంద్ర మానవ వనరుల విభాగం ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు, 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో మునిసిపాలిటీకి ఒకటి చొప్పున 125 ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆమోదించింది. PM SHRIలో భాగంగా రూ. 3,468.75 లక్షల మొత్తాన్ని మంజూరు చేశారు. ఆటిజం కేంద్రాల ఏర్పాటుతో ఆటిజంతో బాధపడుతున్న పిల్లల విద్య, థెరపీలకు ప్రభుత్వమే ఓ మార్గం చూపింది.

### ఆటిజం కేంద్రాల లక్ష్యాలు

* ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్న పిల్లలను అంచనా వేయడానికి అత్యంత ఆధునిక సౌకర్యాలు కేంద్రాల్లో కల్పించి , నిపుణులైన సిబ్బంది నియామకం.
* ప్రభావవంతమైన అభ్యాసం కోసం వారికి మద్దతు , సాధికారత కల్పించడానికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ASD) ఉన్న తల్లిదండ్రులు , విద్యార్థులకు శిక్షణ అందించడం.
* ASD, మేధో వైకల్యం (ID), నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు (SLD) కోసం స్థానిక అవగాహన కేంద్రాలుగా పనిచేయడం.
* ఆటిజానికి పూర్తిగా నయం చేసే చికిత్స లేదు. కానీ, కొన్ని థెరపీల ద్వారా పిల్లల్లో ఆటిజం లక్షణాలను తగ్గించవచ్చు. ఆటిజం గుర్తించిన పిల్లలకు 'ప్రవర్తనా చికిత్స', 'సంభాషణ చికిత్స', 'వృత్తి చికిత్స' చేస్తారు. తద్వారా పిల్లల ప్రవర్తనను మెరుగుపరచడం, పిల్లలు ఇతరులతో మాట్లాడటం, పిల్లలు రోజువారీ పనులు చేయడం వంటి వాటికి ఈ థెరపీలు సహాయపడతాయి. వారి అవరోధాలను గుర్తించి, అవసరమైన చికిత్సలను అందించడం.
* సరైన మూల్యాంకనం, అంచనా, పునరావాసంతో, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా ఆటిజం ఉన్న పిల్లలు సమాజంలో కలిసిపోయేలా సహాయపడుతుంది. వారి తల్లిదండ్రులు, తోబుట్టువులకు అవసరమైన శిక్షణను అందిస్తుంది.
* సమ్మిళిత విద్య , సహచరుల పరస్పర చర్య ప్రభావవంతమైన ప్రవర్తనా చికిత్స, సామాజిక అభివృద్ధికి కీలకం.
* సమాజం, దేశ ప్రయోజనం కోసం ఈ తెలివైన మనసుల్లో దాగి ఉన్న ప్రతిభను కనుగొనడానికి, సమగ్రశిక్షా ఆటిజం కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయనడంలో సందేహం లేదు.





PM SHRI కింద జిల్లా వారీగా ప్రతిపాదిత 125 ఆటిజం కేంద్రాలు రాష్ట్రంలో అనకాపల్లి (2), అనంతపురం (7), అన్నమయ్య (5), బాపట్ల (4), చిత్తూరు (5), తూర్పు గోదావరి (3), ఏలూరు (4), గుంటూరు (4), కడప (8), కాకినాడ (7), కోనసీమ (4), కృష్ణా (5),కర్నూలు (4), పార్వతీపురం మన్యం (3), నంద్యాల (6), నెల్లూరు (6), ఎన్టీఆర్ (5), పల్నాడు (8), ప్రకాశం (7), శ్రీ సత్యసాయి (6), శ్రీకాకుళం (4), తిరుపతి (7), విశాఖపట్నం (1), విజయనగరం (4), పశ్చిమ గోదావరి (6) జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. పురపాలక (మునిసిపల్) స్థాయిలో ఒక్కో ఆటిజం కేంద్రాన్ని నిర్మించడానికి రూ. 27.75 లక్షలు కేటాయించారు.

★★★

### తల్లిదండ్రులుగా పిల్లలకు సమయం ఇవ్వండి

"సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మునిసిపల్ స్థాయిలో ఒక్కో ఆటిజం కేంద్రాన్ని నిర్మించడానికి రూ. 27.75 లక్షలు మంజూరు చేశాం. విద్యార్థుల్లో ఆటిజం లక్షణాలు గుర్తించడం, వాటికి అనుగుణంగా ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, ఐక్యూ అనుగుణంగా విద్య సంబంధమైన సౌకర్యాలు కల్పిస్తాము. ఆటిజాన్ని ఎలా నిర్మూలించాలి. గుర్తించిన తర్వాత తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలపై ఆటిజం సెంటర్లలో శిక్షణ పొందిన ప్రత్యేక ఉపాధ్యాయులతో అవగాహన కల్పిస్తాం. తల్లిదండ్రులుగా పిల్లలకు సమయం ఇస్తూ వారి శారీరక, మానసిక ఎదుగుదలను జాగ్రత్తగా గమనించండి.. ఆటిజం లక్షణాలు కనిపిస్తే తేలిగ్గా తీసుకోవద్దు. మన చేతుల్లో ఉన్నది ఒక్కటే.. ఆటిజం పిల్లల బ్రెయిన్ నిరంతరం ట్రైన్ చేయాలి. Continuous therapy లతో బాటు.. ఇంట్లో వాటిని ప్రాక్టీస్ చేయించాలి. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులిద్దరూ ఒకరి కోసం మరొకరు ధైర్యంగా నిలబడాలి."

– **బి.శ్రీనివాసరావు,** IAS., ఎస్పీడీ, సమగ్ర శిక్షా.

LEAP
Learning Excellence In Andhra Pradesh
School Education Department

# లీప్ వరం.. తగ్గింది యాప్ ల భారం..

- **లెక్కలేనన్ని యాప్ ల నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం..**
- **అన్ని పనులూ ఒకే యాప్‌లోనే పూర్తి చేసే అవకాశం**
- **భారతదేశంలో తొలిసారిగా వినూత్న ఆలోచన**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగంలో ఎప్పటికప్పుడు వినూత్న మార్గాలను అన్వేషిస్తూ, సమర్థవంతమైన విధానాలను అమలు చేస్తుంది. ఉపాధ్యాయులకు భారం తగ్గించడంతో పాటు విద్యా పరిపాలనను మరింత సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో రూపొందించిన నూతన ఆవిష్కరణ యాప్ .... లీప్.

విద్యావ్యవస్థ లో సమగ్రంగా పనిచేసేలా లీప్ యాప్‌ను అభివృద్ధి చేయడం భారతదేశంలో ఇదే తొలిసారి. రాష్ట్రంలోని పాఠశాలలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ యాప్ దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

## లీప్ యాప్ ఎందుకు ?

గతంలో ఉపాధ్యాయులు ఎన్నో యాప్‌లను పాఠశాలల సంబంధిత సమాచారం, నిర్వహణ కోసం ఉపయోగించాల్సి వచ్చేది. హాజరు కోసం ఒక యాప్, విద్యార్థుల వివరాల కోసం మరో యాప్, ముఖ్య సమాచారాన్ని అప్‌లోడ్ చేసేందుకు మరో యాప్... ఇలా ఒక్కో పని కోసం ఒక్కో యాప్‌ను వాడాల్సి ఉండేది. ఈ ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, పాత యాప్‌లను తొలగించింది. వాటి స్థానంలో 'లీప్ – Learning Excellence in Andhra Pradesh' అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. దీనిని ఒకే వేదికగా అన్ని వివరాలను, సమాచారాన్ని నమోదు చేసుకునేలా రూపొందించారు.



## ఒకే యాప్ – ఎన్నో సేవలు

క్షేత్ర స్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యా అధికారులు, సమగ్ర శిక్షా సిబ్బంది మొదలుకొని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకూ ఒకే యాప్‌లో అన్ని ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.

* పాఠశాల కార్యకలాపాలు, విద్యార్థుల అటెండెన్స్, ఫొటోలు – అన్నీ ఒకే యాప్‌లో.
* రానున్న రోజుల్లో మార్కులు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు కూడా ఇదే యాప్‌లో నమోదు చేసే అవకాశం.
* తల్లిదండ్రులకు ప్రత్యేక లాగిన్ – పిల్లల అభివృద్ధిని నేరుగా తెలుసుకునే సౌలభ్యం
* ఫోన్ హ్యాంగ్, మల్టిపుల్ పాస్‌వర్డ్స్ సమస్యలకు చెక్

## సాంకేతికతతో పారదర్శకత

లీప్ యాప్ వినియోగంతో విద్యా వ్యవస్థలో అవకతవకలకు ఎటువంటి తావులేకుండా పూర్తి పారదర్శకతతో తీసుకువచ్చింది. మొబైల్ ఫోన్‌తోనే అన్ని విద్యా పరిపాలనా పనులను నిర్వహించేలా దీన్ని రూపొందించారు.

## మ్యాప్‌లతో కూడిన డ్యాష్‌బోర్డులు

లీప్ యాప్‌లో ప్రత్యేకంగా మ్యాప్‌లతో కూడిన డ్యాష్‌బోర్డులు అమర్చారు. ప్రతి మండలంలోని, జిల్లాలోని, రాష్ట్రంలోని పాఠశాలల సమాచారం మ్యాప్స్ రూపంలో ఉంటుంది. పాఠశాలలకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఉండటంతో వాటి స్థితిగతులు స్పష్టంగా తెలుసుకోవచ్చు. టీచర్లకు ప్రత్యేకంగా డ్యాష్‌బోర్డులు అందుబాటులో ఉండటం వల్ల, వారు తమ పనితీరు, హాజరు, విద్యార్థుల ప్రగతిని తక్షణమే చూడవచ్చు. ఇటీవల విడుదల చేసిన 2024 - 2025 విద్యా సంవత్సరం పరీక్షా ఫలితాలు లీప్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

## డిజిటల్‌తో పారదర్శకత – విద్యారంగంలో కొత్త దిశ


'లీప్' యాప్‌తో పాఠశాల వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారే అవకాశముంది. పని భారాన్ని తగ్గించడంతో పాటు, విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రుల వరకూ తీసుకెళ్లే డిజిటల్ వేదికగా ఇది రూపుదిద్దుకుంటోంది. ఇదే డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్.

## లీప్ యాప్‌తో కలిగే ప్రయోజనాలు

* ఉపాధ్యాయులకు అనవసర పనిభారం తగ్గి, ఎక్కువ సమయం బోధనకే కేటాయించగలుగుతున్నారు.
* విద్యా పరిపాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి సమస్యలను తక్షణమే పరిష్కరించగలుగుతున్నారు.
* విద్యార్థుల హాజరు, పనితీరు గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించే వీలుంది.

– **అమలాపురపు దుర్గాప్రసాద్,** జర్నలిస్ట్,
9701171211

# పిల్లల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుంది




**చిం**తగుంట్ల గీతిక లాంటి విద్యార్థులు గొప్ప సంకల్పం అనే చెట్టుకు నీళ్ళు పోస్తారు. ఈ అమ్మాయి లాంటి వాళ్ళు కలలు కనే గురువుల కళ్ళల్లో వసంతం కురిపిస్తారు. చదవడమంటే గళ్ళలో నుండి ఉట్టిగా చూసిరాతలు రాసుకుంటూ ఇదే చదువనుకునే భ్రమల్లో ఉన్న రోజుల్లో గీతిక లాంటి వాళ్ళు రేపటి తరానికి చుక్కానిగా నిలుస్తారు.

చదవడమంటే తరగతి టెక్స్ట్ పుస్తకాలు చదవడం మాత్రమే కాదు. చదవడమంటే సాహిత్యం చదవడం. చదవడమంటే క్లాసు పుస్తకాలకు మించి గ్రంథాలయ పుస్తకాలు చదవడం.. ప్రపంచాన్ని చదవడం. గ్రంథాలయాన్ని తన గుండెలో ఆలయంగా చేసుకోవడం. ఏడు ఎనిమిదో తరగతి వయసులోనే గుండెలనిండా పిల్లల పట్ల ప్రేమను నింపుకోవడం. తాను చదవడమే కాకుండా పిల్లలందరికీ పుస్తకాలిచ్చి చదివించడం. గ్రంథాలయాన్ని తన సొంత ఇంటికంటే, బడికంటే ఆప్యాయంగా చూసుకోవడం.. తాను ఏదన్నా పొరపాటు చేస్తుంటే అది కాదు దారి ఇది అని చెప్పినప్పుడు వెంటనే తన మార్గాన్ని సరి చేసుకోవడం.

ఏ గురువుకు దొరుకుతారు ఇలాంటి శిష్యులు... గురువు గర్వపడేది ఇలాంటి శిష్యులని చూసినప్పుడే... దారి చూపినప్పుడు ఆ దారిలో వేగంగా నడవ గలిగే శిష్యుల్ని చూసి గురువెంతగా పొంగిపోతాడు. అలాంటి శిష్యురాలు ఈ గీతిక. అలా పుస్తకాలు చదువుతూ చదువుతూ తానున్న స్థలాన్ని తన చుట్టూ ఉన్న జీవితాలను అక్షరబద్ధం చేస్తుంది. చాలా లోతుగా సాహిత్యాన్ని పరిశీలిస్తుంది.

సాహిత్యంతో తనకున్న పరిచయాన్ని గీతిక కథల్లో కవితల్లో లోతుగా ప్రతిబింబింపజేస్తుంది. కవిత రాస్తుంది. తనకున్న మానవీయతను ఈ వయసులోనే కవితల నిండా వొంపుతుంది.



చింతగుంట్ల గీతిక

నిజంగా జ్ఞానానికి వయసుకి సంబంధం లేదు. నివశించే ప్రదేశానికి ఆలోచించే విధానానికి సంబంధం లేదు. ఇలాంటి పిల్లలు పుస్తక మిచ్చిన ధైర్యంతో ముందుకు సాగుతారు. వాళ్ళ వెన్నంటి మనముంటే ఆకాశమే హద్దుగా ఎదుగుతారు.

అలా ఎదుగుతుంది గీతిక. తన కథల ద్వారా సమాజాన్ని అక్షర బద్ధం చేస్తుంది. తన మానవీయతను కవితలలోకి వొంపుతుంది. అంతేకాదు పుస్తకాల అధ్యయనం ద్వారా జీవితానికి ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుంటుంది. మెరుగైన సమాజాన్ని గురించి ఒక కల కంటుంది. అంతేకాదు, ఈ అమ్మాయిని చూసి ఎంతో మంది పిల్లలు కూడా ప్రేరణ పొందుతున్నారు. వాళ్లు కూడా పుస్తకాలు చదవడంలో ఎంతో ఇష్టాన్ని చూపిస్తున్నారు. కథలు, కవితలు రాయడంలో కూడా అంతే వేగాన్ని చూపిస్తున్నారు.

ఈ అమ్మాయి ఎదుగుదల, లక్ష్యంలో ఖచ్చితంగా పుస్తకమే ఉంటుంది. ఈ కవితలు రాయడానికి గీతికకు రెండేళ్లు సరిపోయింది. ప్రతిభ ఉన్న పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు కావడానికి ఈ మాత్రం సమయం సరిపోతుంది. పిల్లలంటే ఇష్టమున్న ఉపాధ్యాయులు వాళ్ళ కోసం కొంచెం సమయాన్ని కేటాయిస్తే సరిపోతుంది. పిల్లలు అద్భుతాలు చేసి చూపిస్తారు. చిన్నప్పటి నుంచి చదువు కంటే బొమ్మలు గీయడమే ఇష్టంగా ఉండి చదివిన చదువు తక్కువే అయినా పుస్తకాల అభిరుచి సంగాపు శ్రీనుని చిత్రకారునిగా మార్చింది. చిత్రకళా ప్రతిభ ఉండడంతో ఇవాళ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ చదువుతున్నాడు. ఈ పుస్తకంలోని బొమ్మలన్నీ శ్రీను వేసినవే. కవర్ పేజీ కూడా.

అందరు పిల్లల్లో ప్రతిభ దాగి ఉంటుంది. అది గుర్తించడం గురువులుగా మన బాధ్యత. అలా గుర్తించడం వల్లే ఇవాళ శ్రీను, నేనే ఆశ్చర్యపడేటంతటి వాడయ్యాడు. చాలా తక్కువ కాలంలోనే చకచకా ఈ పుస్తకంలోని బొమ్మలన్నీ వెయ్యగలిగాడు. ఈ పాఠశాలలో ఈ వరుసలోనే మేఘన, నవదీప్, భావన, మైథిలి, దీక్షిత, లోహిత వంటి వాళ్ళు చాలా మంది ఉన్నారు. ప్రిన్స్, మనీషా, మనోజ్, యోనా, మహేశ్, సుకీర్తి వంటి ఆర్టిస్టులూ ఉన్నారు.

హిమలయ పర్వతాలను అధిరోహించినప్పుడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం. ఇదిగో మళ్లీ ఈ గీతిక రాసిన వేదన కథల కవితల పుస్తకం వస్తున్నప్పుడు కూడా అదే పరవశంతో ఉన్నాను. ఈ పుస్తకం తరువాత నవదీప్ పుస్తకం సిద్ధంగా ఉంది. జార్లపాలెం పిల్లల నుంచి ఇంకా మరెన్నో పుస్తకాలు తప్పకుండా వస్తాయి.


– **మంచికంటి వెంకటేష్**, హెడ్మాస్టర్
జార్లపాలెం,
కొండేపి మండలం, ప్రకాశం జిల్లా 94495 35695

# ప్రభుత్వ విద్యా విక్రమార్కులు

- కార్పొరేటు సంస్థలకు దీటుగా టెన్త్, ఇంటర్ ఫలితాలు
- పదేళ్లలో రికార్డు స్థాయి ఉత్తీర్ణత
- గవర్నమెంట్ షైనింగ్ స్టార్స్ ని సన్మానించిన విద్యా శాఖా మంత్రి నారా లోకేష్

## ప్రైవేటు కాలేజీల్లో చదివితేనే ర్యాంకుల సాధించవచ్చా? ప్రైవేటు విద్యా సంస్థల సిబ్బందే బాగా చెబుతారా?

అదేదీ నిజం కాదంటూ ప్రభుత్వ కాలేజీల్లో చదివిన విద్యార్థులు ఇంటర్మీడియేట్ లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బదులు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియేట్, పదో తరగతి పరీక్షల ఫలితాలే... ప్రభుత్వ విద్యా సంస్థల కృషికి నిలువుటద్దాలు...

## ఇంటర్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణతా శాతం పెరుగుదల

ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో గత పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. అత్యధికంగా 47 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

## వృత్తి విద్య బలోపేతానికి చర్యలు

ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ మొదటి ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 64శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ రెండో ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 82శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ తోనే విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు వృత్తివిద్యను బలోపేతం చేశారు.

## ఇంటర్ లో సంస్కరణలతో మెరుగైన ఫలితాలు

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ విద్య బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఐదేళ్ల తర్వాత 2024లో 217 మంది ప్రిన్సిపాళ్లకు ప్రమోషన్లు ఇచ్చారు. 2024 అక్టోబర్ నుంచి సెంట్రలైజ్డ్ అసెస్ మెంట్ చేశారు. అంతర్గత పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనివేళల్లో మార్పు, వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఆయా సంస్కరణల ఫలితంగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది.

కవర్ స్టోరి



## షైనింగ్ స్టార్స్ కు సన్మానం..

ప్రైవేటు ఇంటర్మీడియట్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీల్లో చదివి అసమాన ప్రతిభ కనబరిచిన 52 మంది **"షైనింగ్ స్టార్స్-2025"**కు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఏప్రిల్ 15న సన్మానించారు.



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రైవేటు కాలేజీల మాదిరిగా అభినందించి, ప్రోత్సహిస్తామని..గతంలో మాటిచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట నిలబెట్టుకున్నారు. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), ఏపీఆర్ జేసీ, ఆదర్శ పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ లలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎమ్ఈసీ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన 28 మంది విద్యార్థులతో పాటు ప్రభుత్వ వృత్తి విద్యా కాలేజీల్లో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులు కలిపి మొత్తం 52 మంది టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి లోకేష్ అభినందించారు. వీరిలో ఆరుగురు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థులందరికీ ల్యాప్ టాప్, శాలువా, గోల్డ్ మెడల్ ( స్వర్ణ పతకం )తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియేట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా, పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు.వి, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విజేతలకు హ్యాట్సాఫ్

ఈ సందర్భంగా విద్యా, ఐటీ శాఖామాత్యులు శ్రీ నారా లోకేష్ గారు మాట్లాడుతూ.. "మీరంతా విజేతలు.. మీకు హ్యాట్సాఫ్..! మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నా!. మీరంతా ప్రభుత్వ విద్య పరువును కాపాడారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారు. పేదరికం వల్ల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి ఆదేశాలతో ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను తీర్చిదిద్దుతున్నాం. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. టెక్ట్స్, నోట్ పుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. విద్యాశాఖలో జూన్ నాటికి సంస్కరణలు పూర్తిచేసి అనంతరం లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టి పెడతాం." అన్నారు.

## కలల సాధనకు కష్టపడాలి.. ప్రోత్సహించే బాధ్యత నాది

జీవితం అనేది జర్నీ.. నాట్ డెస్టినేషన్. ఈ మధ్య కాలంలో విద్యార్థులు బాగా సున్నితంగా ఉంటున్నారు. ఇంటర్ ఫలితాలు ఎలా విడుదల చేయాలనేది మేం రెండు గంటల పాటు చర్చించాం. లక్ష్యం కోసం పనిచేయాలి. చిన్నచిన్న ఆటుపోట్లు ఎదురైనా తట్టుకోవాలి. మీకు అన్ని విధాలా సహకారం అందిస్తాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తాం. కలల సాధనకు కష్టపడాలి. ప్రోత్సహించే బాధ్యత నాది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో వసతులను మెరుగుపరుస్తాం.

– **నారా లోకేష్,** విద్య, ఐటీ శాఖల మంత్రి

### మాలాంటి పేద విద్యారులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాం



**బండి పావని,** విద్యార్థిని

గ్రూప్: ఎంపీసీ

మార్కులు: **986**/1000

కాలేజీ: **జీజేసీ కాలేజీ**, కర్నూలు టౌన్

స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రులు నా మార్కులు చూసి చాలా గర్వపడుతున్నారు. లోకేష్ గారు మంత్రిగా వచ్చిన తర్వాత టెక్ట్ బుక్స్, నోట్ బుక్స్ అందించారు. మధ్యాహ్న భోజనం కూడా పెడుతున్నారు. చాలా ఆనందంగా ఉంది. మా లాంటి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాం. మాకు జేఈఈ మెయిన్స్ కోచింగ్ లేకపోయినా జూనియర్స్ కు ఇస్తున్నారు. మాకు ఆర్థికంగా సహకారంతో పాటు పై చదువులకు కాలేజీలో ఉచితంగా సీటు, కోచింగ్ ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.





## లోకేష్ గారు సన్మానిస్తారని కలలో కూడా ఊహించలేదు



**భుక్యా హరిణి,** విద్యార్థిని

గ్రూప్: బైపీసీ

మార్కులు: **978**/1000

కాలేజీ: **హైస్కూల్ ప్లస్ గర్ల్స్,** మైలవరం, కృష్ణా జిల్లా

మా నాన్నగారు రోజు కూలీకి వెళ్తారు. నేను చిన్నప్పటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. ప్రైవేటు కాలేజీలో చదవాలనే కోరిక ఉండేది. అయినా మా ఆర్థిక పరిస్థితి కారణంగా చదవలేకపోయాను. హైస్కూల్ ప్లస్ లో బైపీసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. దీంతో నా తల్లిదండ్రులు చాలా సంతోషపడ్డారు. అత్యధిక మార్కులు సాధించడానికి ఉపాధ్యాయులు చాలా మద్దతు ఇచ్చారు. పుస్తకాలు కూడా అందించారు. మంత్రి నారా లోకేష్ గారి చేతుల మీదుగా సన్మానం పొందుతానని కలలో కూడా ఊహించలేదు. నేను గైనకాలజిస్ట్ కావాలనేది లక్ష్యం. నాకు సపోర్ట్ చేయండి. నాకు ఉచితంగా కోచింగ్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## 902 మార్కులు తెచ్చుకుని మీ ముందు నిల్చొన్నాను



**జంగా కీర్తన,** దివ్యాంగ విద్యార్థిని

గ్రూప్: ఎంపీసీ

మార్కులు: **902**/1000

కాలేజీ: **మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీ,** రూపెనగుంట్ల, నకరికల్లు, పల్నాడు జిల్లా

నాకు చెవులు సరిగా వినిపించవు. నేను చదవలేనని చుట్టుపక్కల వారు హేళన చేసేవారు. మా నాన్న గారు నన్ను బాగా ప్రోత్సహించారు. 902 మార్కులు తెచ్చుకుని మీ ముందు నిల్చున్నాను. ఐఏఎస్ కావాలనేది నా కల. చదువుకోవడానికి సాయం చేయాలి. కొన్ని కారణాల వల్ల మా నాన్న గారు చదువుకోలేక పోయారు. అందుకే నన్ను కష్టపడి చదివించారు. ఇక్కడ ఇంతమంది మాట్లాడినా నాకు ఏమీ అర్థం కాలేదు.

## నీకు నేనే స్ఫూర్తి అని చెప్పాను

**జంగా బ్రహ్మయ్య,**

జంగా కీర్తన తండ్రి



మాది చాలా పేద కుటుంబం. మా అమ్మాయికి వినపడదు. నా పనులు మానుకుని నా కూతురును చదివించాను. నీకు నేనే స్ఫూర్తి అని చెప్పాను. 1 నుంచి 10 వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివించాను. రోజూ వెళ్లి ఉపాధ్యాయులను కలిసి నా కూతురు చదువు గురించి వాకబు చేసేవాడిని. టీచర్లు బాగా మద్దతు ఇచ్చారు. అందరూ నా కూతురుని ప్రోత్సహించాలని కోరుతున్నాను.

## పారా ఒలింపిక్స్ లో పాల్గొని మెడల్ సాధిస్తాను

**వల్లెపు కుసుమ శ్రీలక్ష్మి కుమారి,**

దివ్యాంగ విద్యార్థిని



గ్రూప్: సీఈసీ

మార్కులు: **827**/1000

కాలేజీ: **ఎస్ ఎల్ వీఆర్ జీఎస్ఆర్వీ జూనియర్ కాలేజీ,** నిమ్మకూరు, పామర్రు

మాది పల్నాడు జిల్లా గుత్తికొండ గ్రామం. అక్కడ పనులు లేక మా తల్లిదండ్రులు గుంటూరుకు వలస వచ్చి పలకలూరులోని ఓ అపార్ట్ మెంట్ లో వాచ్ మెన్ గా పనిచేస్తున్నారు. నాకు దివ్యాంగ కోటాలో సీఈసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. నా మొదటి సన్మానం లోకేష్ గారి చేతుల మీదుగా జరగడం అదృష్టంగా భావిస్తున్నా. గతేడాది మాకు పాఠ్యపుస్తకాలు అందించలేదు. ఈ ఏడాది అందించారు. షటిల్, క్యారమ్స్ నేర్చుకున్నాను. పారా ఒలింపిక్స్ లో పాల్గొని మెడల్ సాధిస్తాను. పీ-4 వల్ల నాలాంటి వారికి చాలా ఉపయోగం ఉంటుంది. చదువు విషయంలో నా తల్లిదండ్రులు నన్ను బాగా ప్రోత్సహించారు. పై చదువులకు మీ సాయం కావాలి. ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. దివ్యాంగులకు నా వంతు సాయం చేస్తాను.

## మా ఊరి నుంచి స్టేట్ ర్యాంక్ వచ్చిన వాళ్లు లేరు

**మాల రాఘవేంద్ర,** ఒకేషనల్ విద్యార్థి



గ్రూప్: 109-(సి.పి.&ఎమ్)

మార్కులు: **958**/1000

కాలేజీ: **గవర్నమెంట్ జూనియర్ కాలేజీ,** ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

మాది కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనతహల్లి గ్రామం. ఎమ్మిగనూరులోని ఎస్సీ హాస్టల్లో ఉంటూ క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్ మెంట్ కోర్స్ చదివాను. మాది చాలా పేద కుటుంబం. మా ఊరి నుంచి స్టేట్ ర్యాంక్ వచ్చిన వాళ్లు ఎవరూ లేరు. నేనే ఫస్ట్ టైం. ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే 958 మార్కులు సాధించాను. మధ్యాహ్న భోజనం పునరుద్ధరించడం వల్ల రెండు కిలోమీటర్లు వెళ్లి భోజనం తెచ్చుకునే అవస్థ తప్పింది. అగ్రికల్చర్ ఆఫీసర్ కావాలనేది నా గోల్.

## పదో తరగతి ఫలితాల్లోనూ అమ్మాయిలే టాప్!

* రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం 81.14గా నమోదు
* పాస్ పర్సంటేజ్ 93.90 శాతంతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం
* 47.64 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి ఫలితాలు ఏప్రిల్ 24న విడుదలయ్యాయి. ఫలితాలు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆన్లైన్లో విడుదల చేసి తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతా ద్వారా ప్రకటించారు. పది పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా, 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 81.14గా నమోదైంది. ఇక 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలవగా 47.64 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది.



### బాలికలు ముందంజ..

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు ఉత్తమ ఫలితాలు సాధించగా, పదో తరగతిలో కూడా బాలికలదే పైచేయి. బాలురు 78.31 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 84.09 శాతం ఉత్తీర్ణత సాధించారు. అంటే దాదాపు 6 శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణత శాతం పొందారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యధిక మార్కులు టాపర్లుగా అమ్మాయిలే నిలవడం విశేషం.



### వాట్సాప్ 'మనమిత్ర'లో మార్కులు

పరీక్ష ఫలితాలంటే ఎప్పుడూ అధికారిక వెబ్ సైట్లలో చూసి తెలుసుకునేవారు. ఈ విద్యా సంవత్సరం వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' యాప్ ద్వారా నేరుగా తెలుసుకునేలా సౌకర్యం కల్పించారు. వాట్సప్ నెంబర్ 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి ఫలితాలను తెలుసుకున్నారు. అలానే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వినియోగించే పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'లీప్' యాప్ కూడా ఫలితాల వేదిక అయ్యింది.

– 'గణేశ్ బెహరా',

పీఆర్వో, సమగ్ర శిక్షా, 77320 97027






## ప్రియమైన నేటి, రేపటి బాలల్లారా,

ముప్పై సంవత్సరాల క్రితం... బెర్లిన్ గోడ విచ్ఛేదనం, జాతి విచక్షణ తగ్గుదల, ఇంటర్నెట్ ఆవిర్భావం లాంటి... మారుతున్న ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో... ప్రపంచమంతా బాల్యాన్ని రక్షించడానికి ఏకమైంది. ప్రపంచంలోని చాలా మంది తల్లిదండ్రుల బాల్యం నియంతృత్వపు నీడలోనో లేదా పడిపోతున్న ప్రభుత్వాల క్లిష్ట సమయాల్లోనో గడిచింది. వారంతా... వారి పిల్లలకు మంచి జీవితం, ఎక్కువ అవకాశాలు, ఎక్కువ హక్కులు లభిస్తాయని ఆశించారు. కాబట్టి 1989లో ప్రపంచ నాయకులంతా అరుదైన ఒక సమావేశంలో... ప్రపంచ బాలలను రక్షించడానికి, వారి హక్కుల సాఫల్యం కోసం... ఒక చరిత్రాత్మకమైన వాగ్దానం చేశారు. రానున్న తరాలకు అది ఒక ఆశాదీపంలాగా వెలుగొందుతున్నది.

మరి మనం ఎంత ప్రగతిని సాధించాము? ఈ మూడు దశాబ్దాల కాలంలో... Convention on the Rights of the Child ఆరంభం నుండి... ప్రపంచ జనాభా అనూహ్యంగా పెరుగుతున్నప్పటికీ... ప్రాథమిక విద్య అందుబాటులో లేని బాలల సంఖ్య సుమారు 40 శాతం తగ్గిపోయింది. మూడు దశాబ్దాల క్రితం, ప్రతిరోజూ సుమారు వెయ్యిమంది బాలలు పోలియోవ్యాధి బారిన పడి అంగవికలులు కావడమో లేదా చనిపోవడమో జరుగుతూ ఉండేది. ఈరోజు ఆ విధమైన సంఘటనలు 99 శాతం మేరకు నిర్మూలించబడినవి. ఈ ప్రగతి వెనుక వ్యాక్సిన్లు, oral rehydration salts, పౌష్టికాహారం మొదలైన... తక్కువ ఖర్చుతో చేపట్టిన ఆచరణాత్మకమైన ఆవిష్కరణలు ఉన్నాయి. డిజిటల్, మొబైల్ సాంకేతికత, మరికొన్ని ఇతర ఆవిష్కరణలు క్లిష్టమైన సౌకర్యాలను సులభంగా, సమర్థవంతంగా... మారుమూల ప్రాంతాలకు చేర్చడానికి, అవకాశాలను విస్తరించడానికి తోడ్పడ్డాయి.

అయినప్పటికీ, ప్రతి సంవత్సరం... పేదరికం, అసమానతలు, పక్షపాతం, దూరాభారాలు మొదలైనవి... మిలియన్ల కొద్ది పిల్లలకు... వారివారి హక్కులను వారికి చేరకుండా చేస్తున్నవి. వైద్యం అందకపోవడం వలన, చేయగలిగివుండి కూడా చేయని కారణాల వలన... ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు... రోజుకు 15 వేల మంది చనిపోతున్నారు. అధిక బరువు ఉన్న పిల్లల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్నది. దానితోపాటుగా రక్తహీనత ఉన్న ఆడపిల్లల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతున్నది. ఆరుబయట మలవిసర్జన, బాల్యవివాహాల లాంటి మొండి సవాళ్ళు... బాలల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును భయపెడుతూనే ఉన్నాయి. మునుపటికన్నా ఎక్కువగానే స్కూళ్ళల్లో పిల్లల సంఖ్య పెరుగుతున్నప్పటికీ... వారికి నాణ్యమైన విద్య అందడం లేదు. స్కూళ్ళల్లో ఉంటే నేర్చుకున్నట్టు కాదు; అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న అరవై శాతం మంది పిల్లలు... నేర్చుకోవడంలో కనీస స్థాయి కౌశల్యాన్నిసాధించలేకపోతున్నారు. ప్రపంచంలోని సగం మంది టీనేజ్ పిల్లలు స్కూళ్ళ లోపల, స్కూళ్ళ వెలుపలా హింసకు గురవుతున్నారు. కాబట్టి, విద్యాలయాలు. వారికి రక్షణ నిచ్చేవిగా లేవు. సంఘర్షణల మూలంగా... రక్షణ, ఆరోగ్యం, భవిష్యత్తు మొదలైన బాలలహక్కులు వారు పొందడం లేదు. ఆవశ్యకమైన బాలలహక్కుల పట్టిక మరింత పెద్దగా ఉన్నది.

ఇక మీ తరం... నేటి బాలల తరం... మీ తల్లిదండ్రులు ఏనాడు ఊహించని నూతన సవాళ్లను, ప్రపంచ సమస్యలను ఎదుర్కొంటున్నది. మన శీతోష్ణస్థితి మనం గుర్తుపట్టలేనంతగా మారిపోతున్నది. అసమానతలు మరింతగా పెరిగిపోతున్నాయి. ప్రపంచాన్ని ఏవిధంగా అవగతం చేసుకోవాలో సాంకేతికత నిర్దేశిస్తున్నది. ఇదివరకటి కన్నా ఎక్కువగా కుటుంబాలు వలసపోతున్నాయి. బాల్యం మారిపోయింది. దానితో పాటు మన విధివిధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉన్నది.

కాబట్టి ఎలాగైతే మనం 30సంవత్సరాలు వెనక్కి Convention on the Rights of the Child వైపు చూస్తున్నామో ... అలాగే రానున్న 30 సంవత్సరాల ముందుకు కూడా చూడాలి. నేటి బాలలు, యువతరం – మీకు అత్యంత ఆవశ్యకమైన అంశాల గురించి... 21వ శతాబ్దపు సమస్యలకు 21వ శతాబ్దపు పరిష్కారాలు వెదకడం గురించి ... మీరు చెప్పేది మేము తప్పక వినాలి.

పై విషయాలు దృష్టిలో పెట్టుకుని... మీ భవిష్యత్తు గురించి నేను ఎందుకు భయపడుతున్నానో చెప్పడానికి 8 కారణాలు ... అదే విషయాల పట్ల నేను ఎందుకు ఆశావహంగా ఉన్నానో చెప్పడానికి 8 కారణాలు ఈ క్రింద ఇస్తున్నాను ... చూడండి:

1 మీకు పరిశుభ్రమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సురక్షితమైన శీతోష్ణస్థితి కావాలి.

2 సంఘర్షణ, విపత్తులు సంభవించే ప్రదేశాల్లో నివసిస్తున్న మీలో... నలుగురిలో ఒకరు మాత్రమే బ్రతకడానికి, నేర్చుకోవడానికి అవకాశం ఉన్నది.

3 మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడుకోవడంలో తప్పు ఏమీ లేదనే విషయం స్పష్టం చేయాలి.

4 మీలో 30 మిలియన్ల మంది పైగా మీ జన్మస్థలాల విడిచి వలసలు వెళ్లారు.


5 మనము సరైన చర్యలు చేపట్టకపోతే ...
మీలో వేలాదిమంది అధికారికంగా బ్రతికి ఉండరు.

6 21 వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ కోసం...
మీకు 21 వ శతాబ్దపు నైపుణ్యాలు అవసరం.

7 మీ డిజిటల్ పాదముద్రలు తప్పనిసరిగా రక్షింపబడాలి.

8 బహుశా, మీ తరం ఒక్కటే దేనిని నమ్మాలో ఎవరిని నమ్మాలో తెలియని అయోమయంలో ఉన్నది.

– **హేన్రియేట హెచ్. ఫోర్**
యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్,
డైరెక్టర్



యాత్రానుభూతి

# విజ్ఞాన యాత్రలు - భావిశాస్త్రవేత్తలకు పునాదులు



కర్నూలు జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన కారణంగా మా పాఠశాల నుండి 8 మంది విద్యార్థులను ఎంపిక చేసి అంతర్జాతీయ విజ్ఞాన విహారయాత్రకు 4,5 ఏప్రిల్ 2025న కర్నూలు సమగ్రశిక్షా వారు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (కుప్పం), విశ్వేశ్వరయ్య పారిశ్రామిక & సాంకేతిక మ్యూజియం (బెంగళూరు)కు తీసుకెళ్లారు. విద్యార్థులు చూసి వచ్చి తమ అనుభవాలను వ్యక్తపరుస్తుంటే కళ్ళు కనిపించని నాకు స్వయంగా చూసిన అనుభూతి కలిగింది. దీన్నిబట్టి పుస్తకాల్లో ఉన్నది నేర్చుకుంటూనే ప్రత్యక్షంగా చూడడం ద్వారా సులభంగా విద్యార్థులకు నేర్పించవచ్చని తెలుస్తుంది. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో చేతుల ద్వారా చేసే సైన్స్ ప్రయోగాలు, నీటి చక్రం ఎలా పనిచేస్తుంది? విద్యుత్ ఎలా ఉత్పత్తి అవుతుంది? వంటి విషయాలు కళ్లకు కట్టినట్లు వివరించారు. పుస్తకాలలో ఉన్నది నేర్చుకోవడం కంటే ప్రత్యక్షంగా చూసి అనుభవించడం ద్వారా విషయాలను త్వరగా అవగతం చేసుకున్నామని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తపరిచారు.





అక్కడ ఆనందానుభూతులను నింపుకొని విశ్వేశ్వరయ్య మ్యూజియంలో పాతకాలపు ఇంజన్లు, యంత్రాలు, 1903 నాటి రైట్ సోదరుల మొదటితరం విమానం, చంద్రయాన్ లాంటి వివిధ శాస్త్రీయ ఆవిష్కరణలను చూశామన్నారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య గొప్పతనం ఆయన సైన్స్ కృషిని తెలుసుకొని మేము కూడా ఆయనలా కావాలని కోరుకుంటున్నామన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మానవ జీవితాలను విప్లవాత్మకంగా ఎలా మార్పు చేసిందో మ్యూజియం సందర్శించడం ద్వారా తెలుసుకున్నామన్నారు. ఏదైనా మొదట ప్రయత్నం చేయడం ద్వారా కొత్త ఆవిష్కరణకు నాంది పలుకుతామని, ఒకసారి విఫలమైనంత మాత్రాన వదిలేయకూడదని, ప్రయత్నం చేస్తూ ఉంటే విజయం సాధించగలమని విద్యార్థులు తెలుసుకున్నామన్నారు. ఈసారి 'సైన్స్ డే'కు సరికొత్త ఆవిష్కరణలు తయారుచేసి ప్రదర్శిస్తామని ఉత్సాహంగా తెలిపారు.

ఈ విజ్ఞాన యాత్ర మా విద్యార్థుల అభ్యసనను కచ్చితంగా మెరుగుపరుస్తుందని నమ్ముతున్నాను. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు చేయడానికి ప్రేరణగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంతమంచి అవకాశాన్ని అందించిన విద్యాశాఖ వారికి మా విద్యార్థులను జాగ్రత్తగా తీసుకెళ్లిన సమగ్ర శిక్షా వారికి, ప్రోత్సహమిచ్చిన మా ఉపాధ్యాయులు ఎస్. నసీమున్నీసా, ఎస్.షకీలాగారికి హృదయపూర్వక ధన్యవాదాలు. పాల్గొన్న మా విద్యార్థులు షేక్.అకీబ, షేక్.ఇక్రా భాను, షేక్.అలీషాఅంజుమ్, షేక్.సానియాసుల్తాన, షేక్. నిస్రాబిన్నుసైబ, షేక్.సాలెహ, షేక్. ఈక్లాస్ అహ్మద్ మరియు షేక్. షాబాజ్‌కు శుభాశీస్సులు. ఇలాంటి ఉపయోగకర విజ్ఞాన యాత్రలు పిల్లలందరికీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం



– **ఎస్. పుష్పరాజ్**, ప్రధానోపాధ్యాయుడు,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ), కర్నూలు
(ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ క్రీడాకారుడు)
9440371151







## పొగడ్తలకు ఉబ్బిపోరాదు

(బాలరచయిత కథ)

ఒక అందమైన కోడిపుంజు ఒక పొలంలో చెట్టుతొర్రలో నివసిస్తుంది. ఒక రోజు అది పొలంలో ధాన్యపు గింజలు ఏరుకుని తింటోంది. ఆకాశంలో ఎగురుతున్న గద్ద దాన్ని చూస్తూనే రైమంటూ కిందకి దిగింది పట్టేద్దామని. ఆ కోడి టక్కున చెట్టు తొర్రలోకి దూరేసింది. చెట్టు బయటే ఒక రాతి మీద కూర్చుని ఏమైనా నువ్వు చాలా అందంగా ఉంటావు సుమా. నీ అంత అందమైన పక్షిని నేనింతవరకు చూడలేదంటే నమ్ము. అని కోడిని ఆకాశానికి ఎత్తేస్తోంది. వినటానికి కోడికి మహా రంజుగా ఉంది. ఆసక్తిగా వింటోంది. అసలు జరిగిందేమిటంటే మా పక్షిరాజు వారు ప్రపంచంలోకెల్లా అందమైన పక్షిని ఎంపిక చేసి ఘనంగా సత్కరించాలనుకున్నారు. నువ్వు కొంచెం బయటికి వస్తే నీ రూపం పూర్తిగా చూసి రాజు గారికి బాగా వర్ణించి చెప్పగలుగుతాను కదా. అంది గద్ద. ఆ పొగడ్తలన్నీ తలకి ఎక్కాయి కోడిపుంజుకు. దాంతో అది ఇంకా ఆసక్తిగా వయ్యారంగా తన రంగు ఈకలతో తోకని ఊపుకుంటూ నడుచుకుంటూ బయటికి వచ్చింది. అంతే క్షణకాలంలో గద్ద తన రెండు కాళ్ళగోళ్ళతో ఆ పుంజుని పట్టుకుని రైమంటూ ఎగిరిపోయింది.



– **డి భరత్ కుమార్ రెడ్డి**, 5వ తరగతి
పెద్దతిమ్మరెడ్డిగారి పల్లి, కోసువారిపల్లి గ్రామం, అన్నమయ్య జిల్లా.

## మీకు తెలుసా?

* మానవులు మొదట ఉపయోగించిన లోహం ***రాగి***
* భారతదేశంలో బొగ్గు అత్యధికంగా ఉత్పత్తి అయ్యే ప్రదేశం ***జార్ఖండ్***
* బృహస్పతికి ***79 సహజ ఉపగ్రహాలు*** ఉన్నాయి
* నాలుగు వేదాలలో అతి పురాతనమైన వేదం ***ఋగ్వేదం***
* మహాభారతంలో భీష్ముడి చిన్ననాటి పేరు ***దేవవ్రత్***
* ఈద్ వేడుకలకు ఏ గ్రహం సంబంధం కలిగి ఉంది?– ***చంద్రుడు***
* ***పింక్ సిటీ*** అని జైపూర్ నగరాన్ని పిలుస్తారు
* కంప్యూటర్ పరిభాషలో, RAM యొక్క పూర్తి రూపం ***రాండమ్ యాక్సెస్ మెమరీ***

## బొమ్మ గీశానోచ్!



– **జి. హాసిని**, పదో తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడ్డేశ్వరం, మంగళగిరి, గుంటూరు జిల్లా



– **ఆళ్లచెరువు చంద్ర కళ**, 7వ తరగతి, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, వద్ది మడుగు గ్రామం, కొనకనమిట్ల మండలం, ప్రకాశం జిల్లా,

## Calligraphy



– **పేరాబత్తులవీరన్నబాబు**, 9వతరగతి,
జగన్నాథపురం, కాకినాడ

## Choose Good Over Go

We know how to live, But we m*ake sure we only live.*
*We know what is right, But we don't follow it alright.*
*We aim for more and more to get, Try a little to reach anywhere near what we set.*
*We comfortably drink that, Though "Dangerous" tag hanging on that.*
*We joyfully chew that, like sweet meat, Which itself says" Harmful to eat".*
*We easily give our vote, To one who knows how to loot.*
*We want our life without pain, But never hesitate to cause pain for our gain.*
*We don't do what we are expected to do, But we do everything that is not supposed to do.*
*And with all this evil in our mind, We say God is not so kind.*
*God laughs and says, "Dear naives choose good, you don't need a God always"*

- TV VARMA, Pydivada village,
sabbavaram (m), anakapalli dt, 8639723339

## బిచ్చగాళ్ళ కథ

ఈ ప్రపంచంలో ఎందరో బిచ్చగాళ్ళు ఉన్నారు . కాని వాళ్ళు అలా ఎందుకు చేస్తారంటే తన కుటుంబ సభ్యులు ఎవరైన అనారోగ్యంతో భాధపడుతున్నప్పుడు, ఎన్ని చేసినా ! ఎక్కడ ఆసుపత్రులకు తిరిగినా ఆ జబ్బు నయం కాదు. వాళ్ళు దేవుడిని తలచుకుని ఇంక నాకు నువ్వే దిక్కు అని చెప్పి భిక్షాటన దీక్ష చేస్తారు. అది కూడ 48 రోజులు, కొంత మంది 100 రోజులు కూడా భిక్షాటన దీక్ష చేస్తారు. అది కూడా వాళ్ళ కుటుంబ సభ్యులకు నయం కాకపోతేనే !

కొంతమంది ఏంటంటేవాళ్ళ కన్న కూతుర్లు, కొడుకులు వాళ్లను వదిలేస్తే ఇంకేమీచేయలేక భిక్షం ఎత్తుకుంటారు. ప్రపంచంలో ఉన్నవాడని, లేని వాడని బేధాలు వెతుకుతూ ఉంటారు. ఉన్నవాడు కొంచెం ఇస్తే లేనివాడు ఎక్కడా ఉండడు. బిచ్చగాళ్ళు మన దగ్గరకు వస్తే వాళ్లను మనం అసహ్యంచుకుంటాం. లేదా ఒక్కరూపాయి వేస్తామ్. ఆ ఒక్క రూపాయి బదులు కాస్త ఎక్కువ డబ్బులు కూడా ఇవ్వొచ్చు. అదీ వద్దనుకుంటే కడుపునిండా అన్నం పెట్టండి. ఆ కాలంలో పెద్దవాళ్లు చెప్పేది 'ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయి'' అని .అలాగే బిచ్చవాడు ధనవంతుడు అవ్వొచ్చు.

– **జోగి సుబ్రమణెమ్మ**, తొమ్మిదో తరగతి,
చిత్తమూరు, తిరుపతిజిల్లా

## మాతృ దీవెన



నిష్కల్మషమైన హృదయం
వెలకట్టలేని అనురాగ నిలయం
మరుజన్మకు ప్రాణం పోసిన దైవం
దైవం మానుష రూపేణ అన్న సత్యం
అరమరికలు ఎరుగని అమృత తుల్యం
కష్టసుఖాలను సమానంగా నెంచిన జీవన సాఫల్యం
అమ్మ అన్న పిలుపుకి నిండు తనం
ఎన్ని జన్మలెత్తినా తీర్చలేని రుణం

అమ్మ దీవెన ఎంతటి విజయానికైనా బాసట
ఎన్నో మధురానుభూతులకు వెలకట్టని మూల్యమట
అమ్మ కంట కన్నీరు ప్రేమకు ప్రతీక
ఆమె ఆవేశపు మాటలు అభ్యున్నతికి దీపిక
అమ్మ కౌగిలిలో వెచ్చదనం మాటలలో తీయదనం
పిలుపులో కమ్మదనం
కడుపు నింపే అమ్మతనం
ఎన్ని చెప్పినా ఏమి చెప్పినా తరగని నిండుతనం.

– **పి .ప్రణతి,** పదవ తరగతి,
ఎన్టీఆర్ మున్సిపల్ హై స్కూల్, శ్రీకాకుళం

# కనువిప్పు

అనగనగా ఓ రాజు. ఆ రాజు పేరు విశ్వవర్మ. ఎవరి మాట వినకపోవటం –ఆయనకున్న చెడ్డ లక్షణం. దీంతో ఆ రాజ్యంలోని ప్రజలంతా భయపడిపోతుంటారు. ఎందుకంటే ఈయన ఏది అడిగితే అది ఇవ్వాలిసిందే, తేవాల్సిందే! అలా కాదంటే వారికి మరణ శిక్ష విధిస్తుంటాడు.

ఒక రోజున ప్రజలంతా తమ ఇళ్లనుంచి బయటకు వచ్చి 'ఇంద్రధనుస్సు'ను చూసి కేరింతలు కొడుతూ ఆనందంలో ఉండటం–రాజు తన అంతఃపురం నుంచి చూశారు. వెంటనే మంత్రి రత్నాకరుడుని పిలిచి, ''రేపటి ఉదయానికల్లా ఆ ఇంద్రధనుస్సును తీసుకురావాలనీ, లేకపోతే మరణశిక్షను విధిస్తాను'' అని ఆదేశించాడు. రాజుగారి కోర్కె తీర్చడం అసాధ్యమనీ తెలిసినప్పటికీ, చెప్పలేని నిస్సహాయస్థితి మంత్రిది.

ఎప్పుడూ నవ్వుతూ ఇంటికి వచ్చే మంత్రి విచారంగా, ముభావంగా రావడంతో మంత్రి భార్య సునంద గమనించి ఏమి జరిగిందో అడిగింది. జరిగిన విషయాన్ని విన్న సునంద 'ఓస్ అంతే కదా! రాజు గారు అడిగిన కోర్కెను రేపు ఉదయానికల్లా నేను తీరుస్తాననీ, హాయిగా నిద్రపోండి' అని చిరునవ్వుతో సమాధానమిచ్చింది.

తరువాత రోజు తెల్లవారుజామునే సునంద పాతబట్టల మూటను తీసుకుని రాజు గారి అంతఃపురం వద్ద వున్న బావి దగ్గరకు వెళ్లి ఉతకడం ప్రారంభించింది. ఉతుకుతున్న శబ్దానికి రాజు ఉలిక్కిపడి లేవడం, వెంటనే భటులతో ఆమెను పిలిపించారు. ఒక మంత్రి భార్యవైన నువ్వు ఇక్కడ ఇలా చేయటం ఏమిటనీ రాజు అడగగా.. సునంద 'నిన్న రాత్రి నా భర్త పండంటి మగబిడ్డను ప్రసవించారు. ఆ పురిటి బట్టలను అంతఃపురంలొనే ఉతికితే మన రాజు గారికి, రాజ్యానికి ఎంతో మంచిది అన్నారని' ఆమె చెప్పింది.

వెంటనే రాజు 'నీకు ఏమైనా మతి వుందా! లేదా! మీ ఆయన ప్రసవించడమేమిటి?!. ఇది విడ్డూరంగా, లోకవిరుద్ధంగా ఉందే, నాతోనే పరిహాసం ఆడతావా?' అని గద్దించాడు.

వెంటనే సునంద 'రాజా, ఎక్కడైతే ఎండతో పాటు వర్షం కూడా ఒకే ప్రాంతాన పడినప్పుడు ఏర్పడేదే ఇంద్రధనుస్సు. దాన్ని మీరు తీసుకురమ్మనడం అన్నది కూడా విడ్డూరం – లోకవిరుద్ధమే కదా! ఒకసారి ఆలోచించండనీ' చెప్పింది.

వెంటనే రాజు తన అజ్ఞానాన్నీ తెలుసుకొని, తను కోరిన ఇంద్రధనుస్సు అసాధ్యమని భావించి, తన కోర్కెను ఉపసంహరించుకున్నానని ప్రకటించాడు. మంత్రి భార్య సునంద తన చదువు –తెలివితేటల తో రాజుకు 'కనువిప్పు' కలిగించి, తన భర్తను కాపాడుకుంది.

– **రావుపల్లి రాజశేఖర్,** టీచర్, ఎం.పి.పి.యూపీ స్కూల్, పి. తిమ్మాపురం, పిఠాపురం మండలం. కాకినాడ జిల్లా, 9963093198





స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి..
మన బడి మ్యాగజైన్ చదువుకోండి.

## ఏకాగ్రత - బాలల కథ

బాలయ్య ఊరగాయలు వ్యాపారం చేసేవాడు. అతనికి శర్వాణి కూతురు, సుజయ్ కొడుకు ఉన్నారు. శర్వాణి ఇంజనీరింగ్ చదువుతోంది. చదువులో ముందంజలో ఉంటుంది. సుజయ్ చురుకైన పిల్లాడు. ప్రయివేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాని చదువులో వెనుకబడి పోయాడు. సుజయ్ చదువులో వెనుక పడడటంతో తండ్రి బాలయ్య మథనపడి పోయేవాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో చాలాసార్లు మాట్లాడాడు, సుజయ్ పై శ్రద్ధ చూపమని. ప్రతిరోజు క్రమం తప్పకుండా సుజయ్ పాఠశాలకు వెళ్ళేవాడు.

అయినా ఎందుకో చదువుపై ఏకాగ్రత పెట్టేవాడు కాదు. కొన్నిరోజులు సుజయ్ మానసిక పరిస్థితిని గమనించి ఓ నిర్ణయానికి వచ్చాడు బాలయ్య. తను చదివే ప్రయివేట్ పాఠశాల ఇరుకు గదుల్లో కిక్కిరిసి ఉండటం, ఆడుకోడానికి విశాలమైన ఆటస్థలం లేకపోవడం, పాఠశాల పనిగంటలు మొత్తం చదువు పేరుతో మానసికంగా యంత్రంలా తయారై శారీరక వ్యాయామం లేకపోవడం అని గ్రహించి ప్రభుత్వ పాఠశాలల్లో సుజయ్ ని చేర్పించాడు. అక్కడ విశాలమైన తరగతి గదులు, ఆడుకోవడానికి ఆటస్థలం, వ్యక్తిగత శ్రద్ధ చూపే ఉపాధ్యాయులు ఉన్నారు. ఆరు నెలల్లో సుజయ్ లో మార్పువచ్చింది. పాటలతో చదువుతూ ఉల్లాసంగా తన చదువును కొనసాగించి మంచి మార్కులు తెచ్చుకోవడం ప్రారంభించాడు. పదో తరగతిలో పాఠశాలకు ప్రథమ స్థాయిలో నిలిచి, ఆటల పోటీల్లో అనేక పతకాలు సాధించాడు. పిల్లలని నిత్యం చదువు పేరుతో బంధించి, మానసిక ఉల్లాసాన్ని సృజనాత్మకతను ఇవ్వకపోతే దేనిపైనా ఏకాగ్రతను ఉంచలేరని బాలయ్యగ్రహించాడు. సుజయ్ చదువుపై ఏకాగ్రత పెట్టి గాడిలో పడినందుకు తండ్రి బాలయ్య ఊపిరి పీల్చుకున్నాడు.



**– కయ్యూరు బాలసుబ్రమణ్యం,**
సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
దిగువ సాంబయ్య పాళెం, తిరుపతి జిల్లా,


**విద్యాహక్కు చట్టం - 2009, సెక్షన్ 12(1)(సి) ప్రకారం**
**2025 - 26 విద్యాసంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు ప్రారంభం**

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా

**ఇప్పుడు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి**

RTE చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాల మరియు బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్రంలో వారి సమీప నివాస ప్రాంతంలోని CBSE/ICSE/IB/State సిలబస్ ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా 25% సీట్లు కేటాయింపు.

**దరఖాస్తు ఎక్కడ ఎలా సమర్పించాలి?**

www.cse.ap.gov.in సందర్శించండి లేదా, మీ దగ్గరలోని సచివాలయం/ ఇంటర్నెట్ / మండల విద్యాశాఖాధికారి కార్యాలయం / మీ-సేవా సెంటర్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.




**అర్హత వయస్సు**

* CBSE/ICSE/IB/ సిలబస్ ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 2, 2019 నుండి మార్చి 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
* State సిలబస్ ను అనుసరిస్తున్న పాఠశాలలలో ప్రవేశం కోసం జూన్ 2, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.

**దరఖాస్తు తేదీలు**

తేదీ: 02-05-2025 నుండి
తేదీ: 19-05-2025 వరకు
www.cse.ap.gov.in
సంప్రదించండి.
Toll Free: 18004258599

రిజిస్టర్ చేయడానికి www.cse.ap.gov.in వెబ్ సైట్ లాగిన్ చేయండి

**ఎవరు అర్హులు?**

ఆరు అంచెల నిర్ధారణ ద్వారా ఎలిజిబిలిటీ ధృవీకరించిన పిల్లలు క్రింద తెలిపిన వివరాల ప్రకారం అర్హులు.

| | |
|---|---|
| ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలు (అనాథ పిల్లలు, హెచ్.ఐ.వి బాధితులు మరియు దివ్యాంగులు) | 5 % |
| షెడ్యూల్డ్ కులాలు | 10 % |
| షెడ్యూల్డ్ తెగలు | 4 % |
| బలహీన వర్గాలకు చెందిన బి.సి, మైనారిటీ, ఓ.సి (గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1,20,000 మరియు పట్టణప్రాంతం కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ. 1,44,000 లోబడిన కుటుంబాల పిల్లలకు) | 6 % |
| మొత్తం | 25 % |

**జారీ చేసినవారు: రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.**

# అంతర రాష్ట్ర వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ

విభా – లీప్ ఫర్ వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ముంబైలో జరిగిన అంతర రాష్ట్ర వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 11 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంఫింయన్‌షిప్ ట్రోఫీని దక్కించుకున్నారు. సమగ్ర శిక్ష, SCERT, విభా ఫౌండేషన్, LFW (LeapForWord) సహకారంతో 2-5 తరగతుల విద్యార్థుల పఠనం, స్పెల్లింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ELP (Experiential Learning Program) కార్యక్రమాన్ని ఎన్టీఆర్, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అమలు చేస్తున్నారు.

**విజేతలు వీరే :** ఎన్టీఆర్ జిల్లా కనిమెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు బి. సింధు ప్రియ (2వ తరగతి, రెండో స్థానం), బి. రేవంత్ (4వ తరగతి, ప్రథమ స్థానం) సాధించారు. వీరికి గైడ్ టీచరుగా విజయలక్ష్మి వ్యవహరించారు. కృష్ణా జిల్లా వక్కపట్లవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన జి. జెతిన్ మణికంఠ (3వ తరగతి, ప్రథమ స్థానం గెలుపొందగా, గైడ్ టీచరుగా విజయ నిర్మల వ్యవహరించారు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎంపీపీఎస్ వండ్లూరు ఆర్ హెచ్ లో 5వ తరగతి చదువుతున్న పి. చరణ్ శ్రీనివాస్ మూడో స్థానం దక్కించుకోగా గైడ్ టీచర్ శిరీష వ్యవహరించారు. ఈ సందర్భంగా విజేతలను, విభా ఫౌండేషన్ ప్రతినిధులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు. వి IAS., సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు IAS. ప్రత్యేక అభినందనలు తెలిపారు.








# మాకు మేమే పోటీ... మాకు మేమే సాటి

**జాతీయస్థాయి ఒలింపిక్స్ భారత్ క్రీడా పోటీలకు 16 మంది దివ్యాంగ విద్యార్థుల ఎంపిక**

•

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ ప్యారడైజ్ లో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు స్పెషల్ ఒలింపిక్స్ భారత్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల విద్యా డైరెక్టర్ విజయ్ రామరాజు. వి. IAS, సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులు పాల్గొనగా, 16 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.










Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur